క్లుప్తంగా

దాబాను ప్రారంభించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్



దాబాను ప్రారంభిస్తున్న స్పీకర్

జహీరాబాద్: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ జహీరాబాద్ మండలం హుగ్గెల్లి గ్రామ శివారులో ఏర్పాటు చేసిన ఓ దాబాను ప్రారంభించారు. ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. అంతకు ముందు కార్మిక సంఘం నాయకుడు ఎంజీ రాములు శాలువాతో సత్కరించారు. సీఐ శివలింగం, ఎస్‌ఐ కాశీనాథ్ బందోబస్తు నిర్వహించారు.

చేసిన సేవలతోనే గుర్తింపు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్: విధినిర్వహణలో ప్రజలకు అందించిన సేవలు ఎల్లప్పుడూ నిలిచి ఉంటాయని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి తెలిపారు. మనూరు మండలం డోవూరు ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వడిత్యా మాణిక్ పదవీవిరమణ సభ నారాయణఖేడ్‌లో ఆదివారం నిర్వహించగా కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన హెచ్‌ఎంను సన్మానించారు. ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, పీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ చౌహాన్, దిగంబర్‌రెడ్డి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు గుండు లక్ష్మణ్, మన్మథ కిషోర్, నర్సింహులు, ప్రసన్న కుమార్, మధుసూదన్‌రెడ్డి, మహేశ్ కుమార్, మేగ్యానాయక్ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం



చిన్నారి కళ్లను పరీక్షిస్తున్న వైద్యుడు

జహీరాబాద్ టౌన్: తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గడ్డం జనార్దన్ ప్రారంభించారు. హైదరాబాద్‌లోని మెడివిజన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో పట్టణంలోని టీఎన్‌జీవోస్ భవనంలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వైద్యులు విశ్రాంత ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పటేల్ రాజేందర్‌రావు, రమేశ్ బాబు, చంద్రశేఖర్, అజీమొద్దీన్, బాగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిత్రకారుడికి సత్కారం



శివకుమార్‌ను సత్కరిస్తున్న సుధాకర్‌రెడ్డి

నారాయణఖేడ్: పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు గుండు శివకుమార్‌ను అఖిల భారతీయ శిక్షా సంస్థాన్ విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి ఘనంగా సత్కరించారు. హైదరాబాద్ బండ్లగూడలో ఆదివారం సరస్వతీ విద్యాపీఠం ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన వారికి ప్రాంతీయస్థాయి వర్షారంభ సమావేశాల్లో సన్మాన కార్యక్రమాలను నిర్వహించారు. డ్రాయింగ్ బుక్స్ (పాఠ్య పుస్తకాలకు చిత్రాలు) తయారు చేసినందుకు గాను గుండు శివకుమార్‌ను సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

మహిళా పోలీస్ స్టేషన్ సీఐగా ప్రమీల



సీఐ ప్రమీల

సంగారెడ్డి టౌన్: స్థానిక మహిళా పోలీస్ స్టేషన్ సీఐగా ప్రమీల ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఆమె వికారాబాద్ నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న పరమేశ్ గౌడ్ బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు షీ టీమ్ అందుబాటులో ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు



రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఆలయం వద్ద భక్తుల సందడి



బంగారు చీర అలంకరణలో పెద్దమ్మ తల్లి

ఆషాఢమాస బోనాల పండుగను ఆదివారం పలు మండలాల్లో ఘనంగా నిర్వహించారు. ఆయా చోట్ల అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయాలకు చేరుకొని అమ్మవార్లకు సమర్పించారు. పోతురాజుల నృత్యాలు, శివ సత్తుల పూనకాలతో ఊరేగింపులు అట్టహాసంగా జరిగాయి.



జిన్నారం: విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో ..



నారాయణఖేడ్: ఆరెల్లి మైసమ్మకు బోనాల ఊరేగింపు



ఝరాసంగం(జహీరాబాద్): పూజల్లో పాల్గొన్న భక్తులు



మునిపల్లి(అందోల్): మన్‌సాన్‌పల్లిలో..



న్యాల్‌కల్(జహీరాబాద్): బోనాలతో తరలి వస్తున్న మహిళలు

కల్యాణ మండపం పనులు ముమ్మరం

రూ.7కోట్లతో నిర్మాణం

- త్వరలోనే అందుబాటులోకి
- అధికారుల ప్రత్యేక పర్యవేక్షణ
- తీరనున్న సమస్య
- ఆనందం వ్యక్తం చేస్తున్న స్థానికులు

శుభకార్యాలకు మనుషుల జీవితాలకు చాలా సంబంధం ఉంది. పుట్టిన నాటి నుంచి జీవనగమనంలో ఎన్నో మలుపులు చూస్తాం. ప్రతి మలుపు ఒక పండుగే. వాటిని జీవితాంతం గుర్తుంచుకునేందుకు ప్రయత్నిస్తాం. అందుకుగాను వాటిని వేడుకగా జరుపుకుంటాం. ఆ వేడుకలు నిర్వహించుకోవడానికి వేదికలు కల్యాణ మండపాలు. మారుతున్న కాలంలో వాటి అవసరం మరింత పెరుగుతూ వస్తోంది. మండపాలు అందుబాటులో లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులు పడాల్సివస్తుంది.

– రామచంద్రాపురం(పటాన్‌చెరు)



నిర్మాణంలో ఉన్న కల్యాణ మండపం

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాలు వేగవంతంగా అభివృద్ధి చెందుతున్నాయి. అనేక కొత్త కాలనీలు ఏర్పడడంతో జనాభా సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. దీంతో కల్యాణ మండపం లేక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ కల్యాణ మండపాలకు లక్షలు ఖర్చు చేయలేక మధ్యతరగతి ప్రజలు ఇళ్ల వద్దే తమ శుభ కార్యాలను నిర్వహించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

ఎకరం భూమి కేటాయింపు

ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని స్థానిక ప్రజాప్రతినిధుల కోరిక మేరకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కల్యాణ మండపం నిర్మాణం కోసం ఎకరం స్థలాన్ని కేటాయించింది. గత ఏడాది మార్చిలో మండపం నిర్మాణ పనులకు కూడా కంకుస్థాపన చేశారు.

ఆధునికంగా..

కేటాయించిన భూమిలో 1700 గజాలలో నిర్మిస్తున్న ఈ కల్యాణ మండపంలో 1500 మందికి సరిపోయేలా హాల్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఒక ఫ్లోర్, సెల్లార్‌తోపాటు రెండు అంతస్తులు నిర్మిస్తున్నారు. నిర్మాణం కోసం రూ.7కోట్లు నిధులను కేటాయించారు. అందులో ఏసీలను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

తక్కువ అద్దెకే ఇచ్చే విధంగా..

ప్రైవేట్ కల్యాణ మండపంలో శుభ కార్యం నిర్వహించాలంటే సుమారు రూ.3 లక్షల నుంచి రూ.5లక్షల వరకు అద్దె చెల్లించాల్సి ఉంటుంది. దానికి తోడు అదనంగా చాలా ఖర్చులుకూడా ఉంటాయి. మధ్యతరగతి వాళ్లు ఏసీ కల్యాణ మండపం వైపు కూడా చూడలేని పరిస్థితి. దీనిని దృష్టిలో ఉంచుకొని అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కల్యాణ మండపం అద్దె ఉండేలా ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రణాళికను రూపొందిస్తున్నట్లు సమాచారం.

పేదలకు అందుబాటులోకి..



కల్యాణ మండపాన్ని ప్రతి పేదవాడికీ అందుబాటులో ఉండేలా చూడాలి. అనేక మంది పేదలు ప్రైవేట్ కల్యాణ మండపంలో లక్షలాది రూపాయలను ఖర్చుచేసి శుభకార్యాన్ని చేయాలని పరిస్థితి ఉంది. పాలకవర్గం, అధికారులు దీనిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.

– రవి, ఇందిరానగర్

కల నెరవేరనుంది



నూతనంగా నిర్మిస్తున్న ఏసీ కల్యాణ మండపంతో త్వరలోనే తెల్లాపూర్ మున్సిపల్ ప్రజల కల నెరవెరనుంది. నామమాత్రపు అద్దెను నిర్ణయించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. త్వరగా పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలి.

– నాగరాజు, కౌన్సిలర్

దీపావళి నాటికి పూర్తిచేస్తాం..



పాలకవర్గం సహకారంతో పనులను మొదలుపెట్టాం. అందరి సహకారంతో దీపావళి నాటికి అందుబాటులోకి తీసుకురావాలన్నది మా లక్ష్యం. కల్యాణ మండపం నిర్మాణానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక కృతజ్ఞతలు.

– మల్లేపల్లి లలిత సోమిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్

రేణుక ఎల్లమ్మా.. చల్లంగా చూడమ్మా..



ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మతల్లి

రేణుక ఎల్లమ్మతల్లి భక్తులకు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఎల్లమ్మవారి ఆలయంలో ఆషాఢమాసం నాలుగో ఆదివారం కావడంతో అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి మొక్కులు చెల్లించుకోవడానికి బోనాలు ఎత్తుకొని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు రావడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. ఎల్లమ్మా.. చల్లంగా చూడమ్మా అంటూ వేడుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించామని అర్చకుడు మహేశ్ తెలిపారు. – పటాన్‌చెరు టౌన్

సరోజనమ్మ తల్లికి పూజలు

మునిపల్లి(అందోల్): సరోజనమ్మ దేవతకు పంచాయతీ రాజ్ ఎస్సీ జగదీశ్వర్ కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని మల్లారెడ్డిపేటలో ఆదివారం వారి ఇంటిదైవమైన అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆషాఢంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పృథ్వీరాజ్, మల్లేశ్వరమ్మ, అనురాధ, చంద్రకళ, ఇంద్రమ్మ, భవాని, నవ్య, శైలజ తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న జగదీశ్వర్

ఉత్సాహంగా పసక పండుగ



ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

నారాయణఖేడ్: వర్షాలు సమృద్ధిగా కురిసి గ్రామాలు పాడిపంటలతో కళకళలాడాలని కోరుతూ మండలంలోని గంగాపూర్‌లో ఆదివారం గ్రామస్తులు పసక పండుగ నిర్వహించారు. గ్రామంలో ఊరేగింపు నిర్వహించి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు. కురుమ సంఘం అధ్యక్షుడు మల్గొండ, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తాటిపల్లి శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ నగేశ్ తదితరులు పాల్గొన్నారు.



మక్త అల్లూరు రోడ్డు పక్కన పెరిగిన పొదలు

పొదలు.. వాహనదారుల వెతలు

కంది(సంగారెడ్డి): మండలంలోని దాదాపు అన్ని రహదారుల వెంబడి ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా కాశీపూర్, కలివేముల, చెర్లగూడెం, మక్త అల్లూరు, జుల్కల్, చేర్యాల్, ఇంద్రకరణ్, బ్యాతోల్ వెళ్లే రహదారుల పక్కగా పొదలు అధికంగా పెరిగి కమ్మేశాయి. దీంతో రాకపోకలకు తిప్పలు తప్పడం లేదని వాహనదారులు వాపోతున్నారు. ఎన్నో యేళ్ల నుంచి ఈ రోడ్లను పంచాయతీ రాజ్ అధికారులు పట్టించుకోకపోవడంతో అధ్వానంగా తయారయ్యాయని ఆరోపిస్తున్నారు. మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక పోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పొదలను తొలిగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయమై పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డిని వివరణ కోరగా ప్రస్తుతం నిధులులేవని, పంచాయతీల నిధులతో వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వేతనం పెంచాలి

నారాయణఖేడ్: మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచడంతోపాటు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ నారాయణఖేడ్ డివిజన్ నాయకుడు చిరంజీవి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ హామీ మేరకు రూ.2,100 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈఎస్‌ఐ, పీఎఫ్ ఇతర సదుపాయాలు కల్పించాలని, సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

సీఐని కలిసిన దళిత నేతలు

జహీరాబాద్: టౌన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన శివలింగంను దళిత సంఘాల నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం సర్కిల్ కార్యాలయానికి వెళ్లి ఆయనను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో రాంచందర్, జయరాజ్, ప్రేమ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

రామాయంపేట(మెదక్): పట్టణంలోని అటవీ రేంజ్ పరిధిలోని కోమటిపల్లి ప్లాంటేషన్‌లో ఆదివారం అశాఖ అధికారులు మొక్కలు నాటారు. నాటిన మొక్కలను సంరక్షించాలని అటవీశాఖ రేంజ్ అధికారి విద్యాసాగర్ సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి ఖుద్బొద్దీన్, సెక్షన్ అధికారి బలరామ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

'స్థానిక'ఎన్నికల్లో సత్తా చాటాలి



మాట్లాడుతున్న దుర్గయ్య

జహీరాబాద్ టౌన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు జి.దుర్గయ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని దత్తగిరి కాలనీలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధిస్తే పార్టీ బలపడుతుందని చెప్పారు. కేంద్రం అమలుచేస్తున్న పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లాలని కోరారు. సమావేశంలో పార్టీ నాయకులు జనార్దన్‌రెడ్డి, విశ్వనాథ్ యాదవ్, సంగారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, నర్సింహులు, రవికుమార్, ప్రభాకర్‌రెడ్డి, అంజి తదితరులు పాల్గొన్నారు.

మహదేవుపల్లిలో..

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని మహదేవుపల్లి చౌరస్తాలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎన్నాం అనిల్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలస్థాయి సమావేశం నిర్వహించారు. అసెంబ్లీ కో కన్వీనర్ నగేశ్‌యాదవ్ మాట్లడుతూ స్థానిక ఎన్నికల దృష్ట్యా పార్టీని బలోపేతం చేయడంపై చర్చించారు. పంచాయతీ ఎన్నికలలో సత్తాచాటాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రావణ్‌కుమార్, నాయకులు సంగమేశ్వర్‌రావు, సతీశ్, సంతోష్, పండరి, చంద్రశేఖర్, నర్సింహులు, కిష్టయ్య, విఠల్ పాల్గొన్నారు.

మన్‌కీ బాత్‌ను వీక్షించిన బీజేపీ శ్రేణులు

నారాయణఖేడ్/జహీరాబాద్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేపట్టిన 112వ మన్‌కీ బాత్‌ను ఆదివారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు గోదావరి అంజిరెడ్డి సూచన మేరకు బీజేపీ శ్రేణులు వీక్షించాయి. కేంద్ర ప్రభుత్వ పథకాలను తెలుసుకొని ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాయిరామ్, పట్టణ అధ్యక్షుడు రాజుగౌడ్ సూచించారు. కార్యక్రమంలో సతీశ్‌కుమార్, ప్రశాంత్, పట్నం మాణిక్, సాయేందర్, ఆనంద్, మురళి, శ్రీకాంత్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అలాగే జహీరాబాద్‌లో మన్‌కీబాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు టీవీల్లో వీక్షించారు. ఆదివారం పట్టణంతోపాటు మండలంలోని హుగ్గెల్లి, మొగుడంపల్లి మండలం ధనసిరి గ్రామంలో కార్యక్రమాన్ని వీక్షించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్యక్రమాల్లో నియోజకవర్గం ఇన్‌చార్జి జగన్నాథ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌గుప్తా, నాయకులు కృష్ణారెడ్డి, విశ్వనాథ్, అప్పం శ్రవణ్, దుర్గయ్య, అరుణ కౌళాస్, అర్చన సారడా తదితరులు పాల్గొన్నారు.


ముగిసిన సప్త భజన కార్యక్రమం



పల్లకిసేవ నిర్వహిస్తున్న భక్తులు

జహీరాబాద్ టౌన్: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీహనుమాన్ మందిరంలో చేపట్టిన సప్త భజన కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. మార్వాడీ యువమంచ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. వారం రోజులుగా 24గంటలపాటు భక్తులు భజనలు, కీర్తనలతో భగవన్నామస్మరణ చేశారు. ముగింపు సందర్భంగా పట్టణంలో పల్లకిసేవ నిర్వహించారు. అలాగే హరేకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నగర సంకీర్తన చేపట్టారు. హౌసింగ్‌బోర్డు కాలనీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. హనుమాన్ మందిరం నుంచి పాదయాత్ర నిర్వహించారు.

రోడ్డులా?.. డంపింగ్ యార్డులా?



రహదారి పక్కన దర్శనమిస్తున్న చెత్తకుప్పలు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రేడియల్ రోడ్లను అభివృద్ధి చేశారు. కానీ కోట్లాది రూపాయలతో నిర్మించిన ఈ రోడ్లు నేడు డంపింగ్ యార్డ్‌లుగా మారుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో భవన నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. డెబ్రిస్‌ను, ఇంటి అలంకరణకు ఉపయోగించే లప్పంను పెద్ద మొత్తంలో రోడ్లపక్కనే ఇష్టానుసారంగా పారబోస్తున్నారు. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. సీసీ కెమెరాలను ఏర్పాటుచేసి డంపింగ్‌చేసే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.